చిన్నకథలు

"వచ్చినప్పటి నుంచి చూస్తున్నా ఏమిటీ అదోలా వున్నావు? నీ బాధేమిటో నాకు చెప్పవచ్చుగా. అట్లా నిమ్మకు నీరెత్తి వట్టు కూచుని నీట్లోకి రాళ్ళు విసిరితే బాధ పోతుందా?" మైథిలి అంది— సుధాకర్ వేపు చురచుర చూస్తూ.

"....."

"ఇట్లా మౌనంగా కూచోడానికేనా ఈ చెరువు గట్టుమీద కొచ్చింది. ఆ కొంగలూ.

చెరువుకోళ్ళు చూడు గుంపులు గుంపులుగా చెరువును ఎంత అందంగా అలంకరించాయో."

"..... ...."

సుధాకర్ ఏమీ మాట్లాడకపోయేసరికి తనే మాట్లాడం సాగించింది.

"మాట్లాడకుంటే మానె కనీసం ప్రకృతి అందాన్నైనా చూడు! కొండవెనక్కి వాలిపోతున్న సూర్యుడు. సన్యాసం తీసుకున్నట్టు కాషాయ వర్ణంలోకి మారిపోతున్న మబ్బులు....ఇంతకుముందు వీటిని చూసి కవిత్వం చెప్పేవాడివి నువ్వు. ఇవాళే మయింది నీకు? సరే నువ్విలాగే వుండు నేను పోతున్నాను" అంటూ లేవబోయింది మైథిలి.

"ప్లీజ్.... నా మనసేం బాగలేదు. ఈ ఒక్కరోజూ...."

"ఏం ఎందుకు బాగలేదు. ఏమయింది నీ మనసుకి? నాతో చెబితే నీమనసు ఎందుకు బాగలేదో చూస్తానుగా. మనసులో బాధ ఇతరులతో చెబితే కుదుటపడుతుందంటారు. నేను దగ్గరదాన్నని నువ్వు అనుకుంటూ వుంటే చెప్పు విషయమేమిటో."

రెండు క్షణాలు మైథిలి కళ్ళలోకి చూసి ఏదో నిశ్చయానికొచ్చినట్టు తల ఆడించి, చెప్పడం ప్రారంభించాడు సుధాకర్.

"ఈ రోజు పొద్దున పోస్టులో మా చెల్లి పేరుతో ఓ ఉత్తరం వచ్చింది. నాకు కొంచెం అనుమానంవచ్చి కవర్ చించి చదివాను. నా మనసు కుతకుత ఉడికి పోయింది. అది విశ్వమూర్తినుంచి వచ్చిన ప్రేమలేఖ. మా చెల్లెలు ఇంటికొస్తూనే అడిగాను. అది నిజం వొప్పుకుంది. ఆ విశ్వమూర్తిగాడు లేంది బతకలేనంది. కోపం పట్టలేక బాగా తన్నాను. ఇంకోసారి ప్రేమా గీమా అన్నావంటే పళ్ళు రాలగొడతా అని బెదిరించి వచ్చాను" సుధాకర్ మొహంలో ఏవగింపు కనబడుతోంది మైథిలికి.

"....." ఈసారి మైథిలి మౌనం.

"ఆడపిల్లలు మరీ దిగజారిపోతున్నారు మైథిలీ! దానికి మహా ఉంటే ఇరవయ్యేళ్ళు లేవు. అప్పుడే ప్రేమట ప్రేమ. అంతా విశ్వమూర్తిగాడే దీని మనసు మార్చేసుంటాడు. రేపు వాడి కీళ్ళిరిచేస్తాను. దొంగ లంజాకొడుకు...." ఖసిఖసిగా తిడుతున్నాడు సుధాకర్.

అందాక మౌనం వహించిన మైథిలి నోరు విప్పింది.

"నాకు ఏభై యేళ్ళనుకున్నావా? నా వయసూ ఇరవయ్యేగా. మరి మన మిద్దరం...."

మైథిలి లేచి చరచరా నడిచి వెళ్ళిపోతోంది. సుధాకర్ గాజు కన్నులతో చూస్తున్నాడు.

—చైత్రాదేవి

బస్సూ, రైలూ 'ఢీ' కొన్నాయనీ, రెండూ కాలువలో పడి అంతా చచ్చిపోయారనీ క్షణాలమీద అందరి చెవులకూ అందింది.

ఒకటీ- పదీ- ఇరవై - యాభయి- వంద, వేలు-ఇలా కొన్ని వేల చెవులకు అదే వార్త అందింది.

కలెక్టరుగారు పత్రికా విలేకర్లకు ఫోన్లు చేశారు.

జన సేవా సంఘం ప్రెసిడెంట్‌గారు కార్లు పంపారు.

క్షణాలమీద అంతా రెడీ చేసుకొని బయల్దేరారు.

రేపు—

మెయిన్ హెడ్డింగ్ తమ వార్తే వుంటుందని పత్రికా విలేకర్లు- అంత తొందరగా బ్రహ్మాండమయిన కవరేజ్ ఇచ్చినందుకు ఎడిటర్‌గారు ప్రసంశా లేఖ స్వయాన సొంత దస్తూరీతో రాస్తారని కలలు కంటున్నారు.

పత్రికలో పతాక శీర్షికన వున్న వార్త చూసి జనమంతా వండర్‌పోతారని- ఏలేకర్లు- ఎవరికి వారే కలల్లో తేలిపోతున్నారు. పవర్‌ఫుల్ వర్డ్స్ కోసం సిగరెట్లమీద సిగరెట్లు కాల్చేసి మరీ ఆలోచిస్తున్నారు.

"స్పీడుగా పోనీయ్."

కలెక్టర్‌గారి కాళ్ళూ, చేతులు ఎక్కడా ఆగట్లేదు- రేపు పత్రికల్లో ఫస్టు పేజీలో వార్త వేయించుకోవాలని ఆయన ఉబలాటం.

"శిధిలాలమధ్య చిక్కుకున్న ప్రమాద బాధితులను ఎంతో సాహసంతో జిల్లా కలెక్టర్ శ్రీ....వెలికి తీశారు.

"....వెలికి తీస్తున్న దృశ్యం."

రేపు ఫస్టు పేజీలో....

ఫస్టు పేజీలో....

కలెక్టరుగారికి ఇలాంటి సదవకాశం ఎప్పుడూ రాలేదు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయన తెగ తొందర పడిపోతున్నారు.

జనసేవా సంఘం అధ్యక్షులవారు కళ్ళను రెడీగా వుంచుకున్నారు.

"ఈ దృశ్యాన్ని చూస్తున్న జనసేవా సంఘం అధ్యక్షులు శ్రీ.... కనుకొలుకుల్లో నుంచి అశ్రువులు(?) రాలుతూ వుండడం పత్రికా విలేకర్ల కంట పడింది...." అని రేపు ఫస్టు పేజీలో పడబోయే వార్తలో.... అవునవును .... వో పేరా అయినా వుంటుంది.

ఫస్టు పేజీలో ఫొటోలో. తను.....!